

హోమియో...

డైలీ హెల్త్ డైరీ

# పాపకు ఆటలమ్మ తగ్గేదెలా..?



డాక్టర్ రాజశేఖర్,
ష్యూర్‌కేర్ హోమియోపతి

మా అపార్ట్‌మెంటులో ఒక అమ్మాయికి చికెన్ పాక్స్ వచ్చింది. తరవాత వరుసగా మరో ఎనిమిది మంది పిల్లలకు సోకింది. ఇది అంటువ్యాధా? దీని నివారణకు హోమియోలో మంచి మందులుంటే తెలియచేయగలరు.

– జి. భారతి, అనంతపురం

చికెన్ పాక్స్, అమ్మవారు, వెరిసెల్లి, తట్టు అనే పేర్లతో పిలిచే ఈ వ్యాధి ఒకవిధమైన వైరస్ వలన సోకుతుంది. ఇది అంటు వ్యాధి. నీటి బుడగలతో కూడిన మచ్చలు, జ్వరం, విపరీతమైన అలసట దీని ప్రధాన లక్షణాలు.

చికెన్ పాక్స్‌కి ప్రధాన కారకం వెరిసెల్ల జోస్టర్ అనే వైరస్. ఒకసారి ఈ వైరస్ మానవ శరీరంలోకి ప్రవేశించిందంటే నీటిబుడగలతో కూడిన మచ్చలతో శరీరంపై ర్యాష్‌తోబాటు జ్వరం వస్తుంది. ఇన్‌ఫెక్షన్ సోకిన 2, 3 రోజులలో లక్షణాలు బయటపడతాయి. ఈ వైరస్ ముఖ్యంగా నోరు, లేదా గొంతులోని లాలాజలంలోనూ, చర్మంపై ఉండే నీటి బుడగల వంటి ర్యాష్‌లోనూ, మ్యూకస్‌లోనూ ఉంటుంది. కాబట్టి వ్యాధి సోకిన రోగిని వాహకంగా భావించవచ్చు.



**చికెన్ పాక్స్ ఎవరికి వస్తుంది?**

10 సంవత్సరాలలోపు పిల్లలకు ఎక్కువగా ఇది సోకే అవకాశం ఉంటుంది. ఒకసారి ఈ వ్యాధి వచ్చి, దీనితో బాధపడిన తరవాత అంత త్వరగా మళ్లీ సంక్రమించదు.

వ్యాధి లక్షణాలు: జ్వరం, నడుము నొప్పి, వణుకు, నిస్త్రాణ ఉంటాయి. పెద్దవారిలో ఈ పరిస్థితి రెండురోజుల వరకు ఉండే అవకాశం ఉంటుంది. తర్వాత ముందుగా కడుపు పైన, వీపుపైన నీటిపొక్కులు వస్తాయి. తరవాత బాహుమూలాల్లోనూ, చేతుల పైన, కాళ్లపైన వస్తాయి. ఈ పొక్కులు వివిధ రకాలుగా ఉంటాయి. మచ్చలుగానూ, చిన్న పొక్కులుగానూ, ఒక్కోసారి నీటితో నిండిన బుడగలుగానూ కనిపిస్తాయి.

హోమియోపతిలో ఈ వ్యాధి నివారణ, చికిత్స కోసం మంచి మందులున్నాయి.

**సల్ఫర్:** చర్మం పొడిగా, జీవం కోల్పోయినట్లుగా ఉండటం, దురద, మంటతో కూడి ఉండటం, ఈ పొక్కులను కడిగినట్లైతే మరింత మంట, దురద కలగటం, చెమట, మలమూత్రాలు అన్నీ దుర్వాసనతో కూడుకుని ఉండటం, దీనికి తోడు కడుపులో మంట, విపరీతమైన జ్వరం, వేడిని భరించలేకపోవటం, చిన్నగా వచ్చిన పొక్కులు పెద్దగా ఉండే చీము గడ్డలుగా మారటం వంటి లక్షణాలకు ఈ మందు బాగా పని చేస్తుంది.

**తూజా:** ముఖ్యంగా చర్మంపై వచ్చే పొక్కులు కేవలం కప్పబడి ఉన్న ప్రదేశాలలోనే రావటం, ఈ పొక్కులకు ఏ మాత్రం రాపిడి కలిగినా విపరీతమైన మంట రావడం జరుగుతుంది. ఎక్కువగా ఈ పొక్కులు ముదురు బూడిద రంగులో ఉండటం, చెమట నుండి తేనెవంటి వాసన రావటం, చర్మంపై వచ్చిన పొక్కులు పుండు పడటం, చికెన్ పాక్స్ తిరగబెట్టిన సందర్భాలలో ఈ మందు బాగా పని చేస్తుంది.

**బెలడోనా:** మితిమీరిన జ్వరం, ఒళ్లంతా సెగలు కక్కుతున్నట్టున్నా పాదాలు మాత్రం చల్లగా ఉండటం, దాహం లేకపోవటం, ఒంటినిండా ఎర్రటి పొక్కులు, ముఖం ఎర్రగా కంది పోవటం, తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలున్నప్పుడు ఈ మందును వాడాలి.

**రస్టాక్స్:** ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఈ వ్యాధి వస్తుంది. నోటిలో నీరూరడం, ఒంట్లో వ్యాధి నిరోధక శక్తి లోపించినప్పుడు ఈ మందు బాగా పని చేస్తుంది. ఒంటి నిండా నీటి పొక్కులు జిలగా ఉండి, గిల్లాలనిపిస్తుంది. విపరీతమయిన జ్వరం, ఒళ్లు నొప్పులు, కండరాలన్నీ పట్టుకు పోవటం, పొక్కులు ఎక్కువగా శరీరంలో కుడివైపున రావటం, నాలుక కొన ఎర్రగా త్రికోణాకారంలోకి మారడం వంటి లక్షణాలున్నప్పుడు ఈ మందు వాడాలి. హోమియో వైద్యుని పర్యవేక్షణలో ఈ వ్యాధికి సరైన చికిత్స చేయించాల్సి ఉంటుంది. ఈ వ్యాధి రాకుండా ముందుగానే మందు వాడవచ్చు.

మీ సాధారణ ఆరోగ్య సమస్యలకు హోమియో చికిత్సా విధానంలో సలహాల కోసం రాయండి:
మా చిరునామా: హోమియో కౌన్సెలింగ్,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి తెలుగు దినపత్రిక, 6-2-249/1,
సాక్షి టవర్స్, రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
ఇ-మెయిల్: health@sakshi.com
(గమనిక: మెయిల్‌లో పంపేవారు సబ్జెక్ట్‌లో homeo అని రాయండి)